# రెండ్రోజుల్లో 1000 కోట్లు తాగించాలి!

- డివిజన్ల వారీగా లక్ష్యం నిర్దేశించిన ఎక్సైజ్‌శాఖ
- రాష్ట్రంలో షాపులకు భారీగా మద్యం సరఫరా
- 31న అర్ధరాత్రి వరకూ క్లబ్‌లు, పబ్‌లకు అనుమతి
- పల్లెల్లో బెల్ట్ షాపులకు 'షరతులు వర్తించవు'!

**ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు**



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): దసరా.. దీపావళి.. డిసెంబర్ 31.. న్యూ ఇయర్.. రాష్ట్రంలో ఆబ్కారీ శాఖకు డబ్బుల వర్షం కురిపించే పండుగలు. ఈ సారి డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో మద్యం అమ్మకాల ద్వారా సుమారు 1,000 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు నిబంధనల్లో సడలింపు ఇవ్వనున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇందుకోసం ప్రతి జిల్లా, ప్రతి డివిజన్‌కు ప్రత్యేక టార్గెట్‌లు ఫిక్స్ చేసినట్టు సమాచారం. ఈ మేరకు కిందిస్థాయి సిబ్బందికి ఎక్సైజ్ ఉన్నతాధికారులు మౌఖిక అదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. లక్ష్యం వెయ్యి కోట్లు కాగా కనీసం రూ.800 కోట్లు రావచ్చని అంచనా వేస్తున్నారు. దసరాకు కూడా ఇదే తరహా ప్రణాళికలు అమలు చేయడంతో కేవలం 11 రోజుల్లోనే రూ.1300 కోట్లు వచ్చాయి. నాడు అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో.. ఈ సారి పకడ్బందీగా టార్గెట్ ఫిక్స్ చేసినట్టు తెలిసింది. శనివారం నుంచి బుధవారం లోగా ఐదు రోజుల్లో రూ.1500 కోట్లకు తగ్గకుండా తాగించాలని, ఆ స్థాయిలో ఇప్పటికే అన్ని దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నట్టు సమాచారం.

### అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి

ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉంచనున్నారు. దీంతో తాగినోళ్లకు తాగినంత మందును విక్రయించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా క్లబ్‌లు, పబ్‌లకు భారీగా మద్యాన్ని తరలించారు. రాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మద్యం అమ్మకాలు భారీగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. నిరుడు డిసెంబర్‌లోనే అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఆ నెల చివరి వారంలో మద్యాన్ని ఏరులుగా పారించింది. కేవలం ఆరు రోజుల్లోనే రూ.1000 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ 28, 29, 30, 31 తేదీల్లో సుమారు రూ.771 కోట్లకు పైగా రాష్ట్ర ఖజానాకు చేరింది. గతేడాది మూడు చివరి దినాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 మద్యం డిపోల నుంచి 6.51 లక్షల బీర్ కేసులు, 4.80 లక్షల లిక్కర్ కేసులు అమ్ముడయ్యాయి. 2021 డిసెంబర్‌లో చివరి నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల మద్యం అమ్ముడుపోగా.. 2022లో అది రూ.775 కోట్లకు చేరింది. 2023లో కేవలం చివరి మూడురోజుల్లో రూ.750 కోట్లకుపైగా మద్యం అమ్ముడైంది.

### బెల్ట్‌షాపులదే కీలక పాత్ర..

**మద్యం అమ్మకాలు** జోరుగా సాగేందుకు ఈ సారి బెల్ట్‌షాపులదే కీలక పాత్ర కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో గ్రామంలో కనీసం 4-10 వరకు బెల్ట్‌షాపులు ఉండగా.. రోజూ వాటి ద్వారానే భారీగా మద్యం అమ్ముడుపోతున్నది. ఈ క్రమంలో 28వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకూ బెల్ట్‌షాపులకు ఎలాంటి షరతులు వర్తించబోవని ఉన్నతాధికారులే స్వయంగా చెప్పినట్టు తెలిసింది. గత ప్రభుత్వం ఓ క్రమ పద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా కూడా.. 'తెలంగాణను తాగుబోతు రాష్ట్రంగా చేశారు' అని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎన్నోవేదికలపై చెప్పారు. ఇప్పుడు ఆయన అధికారంలోకి రావడంతోనే ప్రజాపాలన పేరుతో ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ఎక్సైజ్‌శాఖపైనే ఆధారపడ్డారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాష్ట్రంలోని 60వేలకు పైగా ఉన్న బెల్ట్‌షాపుల తాట తీస్తానని రేవంత్‌రెడ్డి చెప్పారు. అధికారంలోకి రాగానే బెల్టుషాపులు ఎత్తివేస్తామన్న హామీని ప్రభుత్వం ఏం చేసిందని కొందరు ప్రశ్నిస్తున్నారు.

## ఆదాయం అధోగతి

మొదటిపేజీ తరువాయి...

సూత్రం రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. గతంతో పోల్చితే ఒక రాష్ట్ర ఆదాయం ఏటికేడు వృద్ధి చెందితేనే.. ఆర్థికంగా వృద్ధి చెందుతున్నట్టు లెక్క. కానీ నిరుటితో పోల్చితే ఈ ఎనిమిది నెలల్లో తెలంగాణ ఆదాయం భారీగా తగ్గిపోయింది. నిరుడు నవంబర్ నాటికి ఖజానాకు రూ.1,11,141.37 కోట్ల ఆదాయం రాగా.. ఈ సారి రూ.7,841.33 కోట్లు తగ్గింది. అంటే నిరుడు కన్నా 7.05 శాతం తగ్గుదల నమోదైంది. వాస్తవానికి ఆదాయ పరంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఏటికేడు వృద్ధి సాధిస్తున్నది. కరోనాతో 2020-21లో ఆదాయం పడిపోయినా.. ఆ మరుసటి సంవత్సరమే కోలుకున్నది. కానీ.. ఐదేండ్ల తర్వాత తొలిసారి రాష్ట్ర ఆదాయం తిరోగమనం వైపు సాగింది. దీనిని బట్టే రాష్ట్ర పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు.

## రేపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**క్యాబినెట్ సమావేశం వాయిదా**

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నది. సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించాలని స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ నిర్ణయించారు. మూడోసభ రెండో సమావేశాల్లో భాగంగా 4వ సెషన్‌ను నిర్వహించాలని స్పీకర్ నిర్ణయించిన నేపథ్యంలో సభను నిర్వహిస్తున్నట్టు అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అదేరోజు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు శాసనసభ నివాళి అర్పించనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం జరగాల్సిన క్యాబినెట్ సమావేశం వాయిదాపడినట్టు సచివాలయవర్గాలు తెలిపాయి. త్వరలోనే క్యాబినెట్ సమావేశం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నది.



## పారాసిటమాల్ ఓవర్ డోస్‌తో మహిళ మృతి

**బిటన్‌లో ఘటన.. కేసు నమోదు**

లండన్, డిసెంబర్ 28: అనారోగ్యంతో దవాఖానకు వచ్చిన ఓ 30 మహిళ పారాసిటమాల్ ఓవర్‌డోస్ అవ్వటం వల్ల మరణించింది. బ్రిటన్‌లోని విడ్నెస్ పట్టణంలో 19 ఏప్రిల్ 2017న చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మృతి చెందిన లారా హిగ్గిసన్(30)కు ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. 'న్యూమోనియా'బారిన పడ్డ ఆమె చికిత్స కోసం 5 ఏప్రిల్ 2017న దవాఖానలో చేరింది. ప్రతిరోజూ పారాసిటమాల్ డోస్‌ను పెంచుతూ ఆమెకు చేసిన చికిత్స వికటించిన సంగతి వైద్యులు ఆలస్యంగా గుర్తించారు. దీనికి విరుగుడుగా యాంటీ డోస్ ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బాధిత మహిళ శరీరంలోని కీలక అవయాలు దెబ్బతిని మరణానికి దారి తీసిందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై వైద్య అధికారులు దర్యాప్తు చేపట్టారు. లారా హిగ్గిసన్ 5 అడుగుల ఎత్తు, 40 కిలోల బరువు మాత్రమే ఉన్నారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోకుండా 'పారసిటమాల్' అధిక మొత్తంలో ఇవ్వటం..మరణానికి దారి తీసిందని వైద్య నిపుణులు భావిస్తున్నారు.

# వరంగల్ హెల్త్‌సిటీకి బ్రేక్?

- వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ దవాఖానపై సర్కారు నిర్లక్ష్యం
- రేవంత్‌రెడ్డి సమీక్ష, ఆడిటింగ్ తర్వాత నిలిచిన నిర్మాణ పనులు
- దేశంలో నంబర్‌వన్ దవాఖానగా తీర్చిదిద్దేలా కేసీఆర్ సర్కార్ ప్లాన్
- బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి
- మిగిలిన కొద్దిపాటి పనులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

**రోగులకు అందుబాటులోకి రాకుండా నిలిచిపోయిన దవాఖాన**



నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచిపోయిన స్థితిలో వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం

వరంగల్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణలో జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే అత్యున్నత సేవలు అందించేలా వరంగల్‌లో హెల్త్ సిటీ నిర్మించేందుకు ప్రణాళికలు రచించింది. ఢిల్లీలోని ఎయిమ్స్ తరహాలో సకల వైద్య సౌకర్యాలతో వరంగల్‌లో 24 అంతస్థుల సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవనాన్ని శరవేగంగా పూర్తి చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులు నిలిచిపోయాయి. మిగిలిపోయిన కొద్దిపాటి పనులు పూర్తి చేసి, వైద్య పరికరాలను అమర్చే దశలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన అద్భుతమైన దవాఖానపై దృష్టి పెట్టకుండా కాంగ్రెస్ సర్కారు సాకులు చెబుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు దవాఖాన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు 3 రోజుల క్రితం ఓ మంత్రితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వారు కోరినట్టు తెలుస్తున్నది.

### జనం కోసం.. కేసీఆర్ ఆశయం

వరంగల్‌లో అధునాతన వసతులతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం కోసం 2021 జూన్ 21న అప్పటి సీఎం కేసీఆర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. రూ.1,116 కోట్లను కేటాయించారు. భవన నిర్మాణం, సర్వీసుల కోసం రూ.884 కోట్లు, వైద్య పరికరాల కోసం రూ.107 కోట్లు, ఇతర పన్నులకు రూ.125 కోట్లుగా నిర్ణయించారు. 2208 పడకలతో దవాఖాన నిర్మించాలని, పీఎంఎస్ఎస్‌వై దవాఖానలోని 250 పడకలతో కలిపి 2458 పడకల అద్భుతమైన దవాఖాన ఏర్పాటు చేయాలని భావించారు. నిర్ణయించిన నమూనా ప్రకారం దవాఖానలో 35 విభాగాల్లో, 500 డాక్టర్లు, 1000 మంది నర్సులు, 1000 మంది పారామెడికల్, ఇతర సిబ్బంది పని చేసేలా సదుపాయాలు కల్పించాలని భావించారు. పరీక్షలు, అత్యవసర సేవలు, అన్ని బెడ్లకు ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం, శస్త్రచికిత్సలు, అవయవాల మార్పిడి, కీమోథెరపీ, రేడియేషన్, సెంట్రల్ కిచెన్ వంటి సదుపాయాలతో అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రచించారు. పర్యావరణహిత భవనం, వ్యర్థాల నిర్వహణకు సదుపాయంతో నిర్మించేలా డిజైన్ చేశారు. రోగులకు మరిన్ని వసతులు కల్పించేందుకు డిజైన్‌లో మార్పులు చేయాల్సి వచ్చింది. నిర్మాణ ఖర్చులు పెరగడంతో అధికారులు అంచనాలు పెంచారు. నిర్మాణ పనులు 2023 నవంబర్ చివరి వరకు పూర్తయ్యేలా అప్పటి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఎన్నికల షెడ్యూల్‌తో పనుల్లో జాప్యం జరిగింది.

### అంతా అయోమయం.. రేవంత్ సమావేశం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు దాదాపుగా ఆగిపోయాయి. ఇందుకు కారణం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమే అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించారు. సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనులు పరిశీలించి, సమీక్ష నిర్వహించారు. నిర్మాణ అంచనాలు పెరిగాయని, ఖర్చులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దాదాపు పూర్తికావొచ్చిన దవాఖాన పనులు రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నెమ్మదించాయి. విచారణ పేరుతో అద్భుతమైన దవాఖానను అడ్డుకోవడం సరికాదని వరంగల్ సహా చుట్టుపక్కల జిల్లా ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా దవాఖానను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



వరంగల్ హెల్త్‌సిటీలో పడకల సంఖ్య **2458**

| | |
|---|---|
| వైద్యసేవలు అందించే విభాగాలు **35** | నిర్మాణానికి మొత్తం కేటాయించిన నిధులు **1,116 కోట్లు** |
| భవన నిర్మాణం, సర్వీసులకు నిధులు **రూ.884 కోట్లు** | |
| వైద్య పరికరాలకు కేటాయించిన నిధులు **107 కోట్లు** | పనుల కోసం ప్రతిపాదించిన మొత్తం **125 కోట్లు** |
| హెల్త్ సిటీలో సేవలు అందించే వైద్యులు **500 మంది** | నర్సులు: **1000 మంది** పారామెడికల్, ఇతర సిబ్బంది: **1000 మంది** |

# ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి టెండర్లు

మొదటిపేజీ తరువాయి...

**ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం టెండర్ల వివరాలు** (రూ.కోట్లలో)

| ప్యాకేజీ | ఎక్కడి నుంచి ఎక్కడికి | కిలోమీటర్లు | వ్యయం |
|---|---|---|---|
| ప్యాకేజీ-1 | సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్-రెడ్డిపల్లి | 34.518 | 1,529.19 |
| ప్యాకేజీ-2 | రెడ్డిపల్లి-ఇస్లాంపూర్ | 26 | 1,114.80 |
| ప్యాకేజీ-3 | ఇస్లాంపూర్- సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ | 23 | 1,184.81 |
| ప్యాకేజీ-4 | ప్రజ్ఞాపూర్-రాయగిరి | 43 | 1,728.22 |
| ప్యాకేజీ-5 | రాయగిరి-తంగడపల్లి | 35 | 1,547.04 |
| మొత్తం | | 161.518 | 7,104.06 |



పూర్తిచేయాలని, ఐదేండ్లపాటు మెయింటెనెన్స్ కూడా చేయాల్సి ఉంటుందని టెండర్ నిబంధనల్లో స్పష్టం చేశారు. టెండర్ల దాఖలుకు ఈ నెల 27 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 వరకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 17న టెండర్లు తెరుస్తారు. ఆన్‌లైన్ పద్ధతిలో టెక్నికల్, ఫైనాన్స్ బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించిన సంస్థకు సంబంధించిన ఫైనాన్స్ బిడ్‌ను తెరుస్తారు. అంతిమంగా తక్కువ ధర కోట్ చేసిన సంస్థకు పనులు దక్కుతాయి. సంగారెడ్డిలోని గిర్మాపూర్ నుంచి తంగడపల్లి వరకు ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగాన్ని నిర్మించాలని నిశ్చయించిన విషయం విదితమే. భూసేకరణలో సమస్యల వల్ల ఈ టెండర్ల ప్రక్రియ చాలా ఆలస్యమైంది. ఇప్పటికీ ఇంకా 5% మేరకు భూసేకరణ చేయాల్సి ఉన్నది. యాదాద్రి, రాయగిరి ప్రాంతాల్లో భూసేకరణను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రహదారుల శాఖ టెండర్లు ఆహ్వానించడం గమనార్హం.

### బీఆర్ఎస్ హయాంలోనే అంకురార్పణ

ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అంకురార్పణ జరిగింది. హైదరాబాద్‌కు దాదాపు 50 కి.మీ. దూరంలో ఔటర్ రింగురోడ్డుకు సమాంతరంగా మరో రింగురోడ్డును నిర్మించాలని నిర్ణయించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందుకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను రూపొందించి కేంద్రానికి పంపడంతో ఆమోదం కూడా లభించింది. భూసేకరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధ వైఖరిని అవలంబించకుండా రైతుల నుంచి సానుకూల స్పందన వచ్చేలా చర్యలు చేపట్టడంతో కొంత జాప్యం జరిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు బలవంతంగా భూసేకరణకు దిగింది. దీంతో యాదాద్రి, రాయగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఇప్పటికీ ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

### ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగం డీపీఆర్‌కు నో టెండర్!

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాలనుకుంటున్న ట్రిపుల్ దక్షిణ భాగం డీపీఆర్ (సమగ్ర ప్రాజక్టు నివేదిక) తయారీకి కన్సల్టెంట్లు ముందుకు రాలేదు. ఆ భాగం నిర్మాణం కోసం గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం.. సంబంధిత డీపీఆర్ రూపకల్పన కోసం నవంబర్ 25న గ్లోబల్ టెండర్లను ఆహ్వానించి, నెల రోజుల గడువు ఇచ్చింది. శనివారం ఆ టెండర్లను తెరిచేసరికి ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు. దీంతో సోమవారం మళ్లీ టెండర్లను ఆహ్వానించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్ణయించారు.

### కన్సల్టెంట్ల విముఖతపై అనుమానాలు

ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగాన్ని తమకు అనుకూలంగా నిర్మించుకోవాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని, అందుకే గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌ను మార్చారని విమర్శలున్నాయి. ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగంపై సమగ్ర అధ్యయనం, భూసేకరణ, డీపీఆర్ తయారీ తదితర అన్ని అంశాలపై ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే పలు దఫాలు సమావేశమైన ఈ కమిటీతో సాక్షాత్తూ ముఖ్యమంత్రి కూడా భేటీలు నిర్వహించారు. అయినప్పటికీ డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ల నుంచి స్పందన రాకపోవడం పలు అనుమానాలను రేపుతున్నది. ప్రభుత్వంపై భరోసా లేక కన్సల్టెంట్లు ముందుకు రాలేదా? లేక మరేదైనా కారణం ఉన్నదా? అనేది అంతుబట్టడంలేదు.



## కందులకు 400 బోనస్ ఇవ్వండి

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయండి
- ఎన్నికల హామీని వెంటనే నెరవేర్చండి
- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కందులకు క్వింటాకు రూ.400 చొప్పున బోనస్ ఇవ్వండి.. రాష్ట్రవ్యాప్తంగా అవసరం మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి' అంటూ హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సుమారు 6 లక్షల ఎకరాల్లో కంది పంట సాగుచేశారని, సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కందులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్, ఎన్నికల మ్యానిఫెస్టోలో కందులకు మద్దతు ధర చెల్లించడంతోపాటు క్వింటాకు రూ.400 చొప్పున బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పంట చేతికొచ్చినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రూ.7,550 మద్దతు ధర కంటే తక్కువగా బహిరంగ మార్కెట్‌లో 6,500 నుంచి రూ.6,800 వరకు రైతులు తెగనమ్ముకుంటున్నారని, దీంతో రైతులు క్వింటాకు రూ.800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంది రైతాంగానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసాను ఇచ్చారు.

# పట్టణ పేదలకు 'ఇండ్లు' లేనట్టేనా?

- జాగ ఉంటేనే ఇల్లు అంటున్న సర్కార్
- సొంత జాగ లేనివాళ్లే అధిక శాతం
- ఖాళీ ప్లాట్లు ఉన్న వారికే అవకాశం



హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): నగరాలు, పట్టణాల్లో సొంత స్థలాలు లేని నిరుపేదలకు తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం అందని ద్రాక్షేనా? ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుపేదల ఆశలపై సర్కారు నీళ్లు చల్లిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. తొలి దశలో సొంత జాగ ఉంటేనే ఇల్లు మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టంచేయడమే అందుకు కారణంగా తెలుస్తున్నది. మలి విడతల్లోనైనా వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందా? అన్న అనుమానాలకు సర్కారు వద్ద సమాధానమే లేదు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర జిల్లా కేంద్రాల్లో మురికివాడల్లో నివసిస్తున్న లక్షలాది మంది నిరుపేదలకు సొంత జాగలు లేవు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10 లక్షలకు పైగా ఇండ్ల మంజూరు కోసం దరఖాస్తులు అందాయి. వాటిలో 90 శాతం మంది సొంత జాగ లేనివారే ఉన్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు అంతంత మాత్రంగానే ఉండే అవకాశం కనిపిస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల్లో సుమారు 82 లక్షల వరకు దరఖాస్తుదారులు ఇల్లు కోసమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో దాదాపు సగంమంది హైదరాబాద్ సహా పట్టణాల్లో నివసిస్తున్న పేదలు ఉన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం తొలి దశలో భాగంగా 4.5 లక్షల మందికి ఇండ్లు మంజూరు చేయాలని సర్కారు సంకల్పించింది. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న జాగ లేని పేదలకు తొలి దశలో ఇల్లు మంజూరయ్యే ఆస్కారం లేకుండా పోయింది.

### పట్టణ పేదల ఇండ్లపై స్పష్టత కరువు

కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న పేదల గృహనిర్మాణానికి సంబంధించి సహజంగా పట్టణ ప్రాంతాల్లో గ్రూప్ హౌసింగ్ స్కీమ్‌లను అమలుచేస్తారు. గతంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం, బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ జాగల్లో గుడిసెలు నిర్మించుకొని ఉంటున్న వారిని ఖాళీ చేయించి అక్కడే వారికోసం అపార్ట్‌మెంట్లు (ఇన్ సిటూ పద్ధతి) నిర్మించడం ఆనవాయితీ. లేనిపక్షంలో ప్రభుత్వ స్థలంలోనే అపార్ట్‌మెంట్లు నిర్మించి వారికి కేటాయిస్తారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో మాత్రం పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఇండ్ల కేటాయింపుపై స్పష్టత లేదు. కేవలం జాగ ఉన్నవారికే ఇండ్లు కేటాయిస్తామని పేర్కొనడంతో పట్టణ పేదలకు ఇండ్లు దక్కే వీలులేదని అధికారవర్గాలూ స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ఎవరికైనా ఖాళీ జాగ ఉన్నప్పటికీ వాటికి సరైన పత్రాలు ఉండటం లేదు. పత్రాలున్నా ఇంటి నిర్మాణంలో నిబంధనలు, షరతులు ఉంటాయి. వాటికి అనుగుణంగానే ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. అతితక్కువ జాగలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవడం సాధ్యంకాదని వారు తేల్చి చెప్తున్నారు.

### సిటీలో ప్లాట్లు ఉన్నవారికి అవకాశం

గ్రేటర్ పరిధిలో చాలామంది లేఔట్లలో ఇండ్ల స్థలాలు కొన్నవారే ఉన్నారు. చాలామందికి వారసత్వంగా వచ్చిన స్థలాలు ఉన్నాయి. వాటి విలువ నేడు రూ.కోట్లలో ఉంది. అయినా వారు ఇల్లు నిర్మించుకునే స్థితిలో లేరు. అటువంటివారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనలకు లోబడి ఇల్లు మంజూరు చేస్తామని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఇంటి జాగ పత్రాలు క్లియర్‌గా ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన ఉంటే ఇల్లు మంజూరవుతుందని, జాగ విలువతో సంబంధం లేకుండా వారి ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని ఇల్లు మంజూరు చేస్తామని వారు పేర్కొంటున్నారు.

### ప్రత్యేక ఉత్తర్వులొస్తేనే పట్టణ పేదలకు ఇండ్లు

గ్రేటర్ హైదరాబాద్ సహా నగరాలు, పట్టణాల్లో సొంత జాగలేని పేదల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు, తగిన మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ ప్రభుత్వం ఈ తొలి విడతలోని మంజూరయ్యే ఇండ్లల్లో పట్టణ పేదలకు కేటాయించాలని భావిస్తే ప్రత్యేక ఉత్తర్వులు తప్పనిసరని పేర్కొంటున్నారు. అప్పటి వరకు వారికి ఇల్లు మంజూరయ్యే వీలు లేదని స్పష్టంచేస్తున్నారు.